క్లుప్తంగా

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ ఇండియా విద్యార్థి ఐశా తస్లీమ్.. ఈనెల 8 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే కరాటే దూ ఇండియా ఆర్గనైజేషన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికై నట్లు అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎంపికై నట్లు వివరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో విద్యార్థిని ఆలిండియా షైల్ చీఫ్ సాలాంబిన్ ఉమర్ అభినందించి సన్మానించారు. డీఎస్‌కేడీఎస్ సలహాదారులు వెంకటేశ్వర్లు, మాస్టర్లు అభిలాష్, రాకేష్, సుస్వర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: పదోతరగతి పరీక్షల్లో 9.3 జీపీఏ సాధించిన స్థానిక కొనపాలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కనీజ్ ఫాతిమాను గురువారం ఆల్‌మేవా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ వెనుకబడిన ముస్లింలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఇశ్రత్‌అలీ, ఎండీ.అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వహీద్‌షా, సిరాజ్‌ఖాన్, అలీంఖాన్, ఖాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులకు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వనపర్తి పట్టణంలో రెండో రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఆర్‌కే స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. పాయింట్‌ఫైట్‌లో ఆయా వెయిట్‌కేటగిరీల్లో జయదీప్‌సింగ్, అగస్త్యసాయి బంగారు పతకాలు, సారిక, దీక్షితులు వెండి పతకాలు, అచ్యుత్, యశ్వంత్, హర్షవర్ధన్, నవ్య, సౌమ్య, హర్షశ్రీ, వర్షిని, గణేష్ కాంస్య పతకాలు పొందినట్లు తెలిపారు. మ్యూజికల్ ఫామ్‌లో హర్షశ్రీ, సాయిసుజన, మనస్విత ప్రథమ, ద్వితీయ, తృతీయ, విశాల్, హర్షవర్ధన్, జయదీప్‌సింగ్ మొదటి స్థానం, ఓంకార్ ద్వితీయ, రాహుల్, విఘ్నేష్ మూడోస్థానం సాధించినట్లు తెలిపారు. శ్రేయ, శివప్రసాద్, భరత్ టీమ్‌కటాస్‌లో మూడోస్థానంలో నిలిచినట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌పీ పి.వెంకటేశ్వర్లు విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సలహాదారులు ఎంఎస్.విజయ్‌కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఎంకు వినతిపత్రం పంపినట్లు పేర్కొన్నారు. కార్మికుల్లో కొంతమందికి బాండ్ల డబ్బులు చెల్లించారని, మిగతా వారికి అందజేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద ఒకొక్కక్క ఆర్టీసీ కండక్టర్‌కు రూ.10వేలు బోనస్ ఇవ్వాలని ఆర్టీసీలో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, డ్రైవర్, కండక్టర్ల నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఆర్‌పీఎస్ 2017కు సంబంధించిన ఏరియర్స్ డబ్బును నగదు రూపంలో చెల్లించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, సోహైల్‌ఖాన్, అబ్దుల్ ఖవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని వర్నె గ్రామానికి చెందిన చిన్న కొండన్న కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. కాగా జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొండన్న మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, కోఆప్షన్ ఖాజాఖౌరీ, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బొడ్డు రమేష్, కొండన్న తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతి

చిన్నచింతకుంట: లాల్‌కోట ఎంపీటీసీ సభ్యుడు శివరాజు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం హైదరబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వివరించారు.

వసతులు నిల్.. ఫలితాలు ఫుల్

- సమస్యల వలయంలో కేజీబీవీ
- అసంపూర్తిగా భవనం
- కనీస వసతులూ కరువే
- అయినా వందశాతం ఫలితాలు సాధిస్తున్న వైనం



ప్రహరీలేని కేజీబీవీ భవనం



అసంపూర్తిగా భవనం

రాజాపూర్: మండల శివారులోని కేజీబీవీలో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటూనే చదువు సాగిస్తున్నారు. 2019–20లో ఏర్పాటైన మండలానికి కేజీబీవీని మంజూరు చేయడంతో అప్పటి సర్పంచ్ కొప్పెరి బచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో అనుకూలమైన అద్దెభవనం లేకపోవడంతో మొదట కుచ్చర్‌కల్‌లోని ఓ అద్దె భవనంలో ప్రారంభించారు. కాగా ప్రభుత్వం నుంచి అద్దె చెల్లించకపోవడంతో యజమాని ఖాళీ చేయించాడు. దీంతో మండల కేంద్రంలో మరో అద్దె భవనంలో అరకొర వసతుల నడుమ నెట్టుకొచ్చారు. అప్పటి ప్రభుత్వం పక్కా భవనం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో అప్పటి సర్పంచ్ బచ్చిరెడ్డి మల్లేపల్లి రోడ్డులో ఓ వెంచర్‌లో గ్రామపంచాయతీకి రావాల్సిన 10శాతం స్థలం తీసుకుని నిర్మాణానికి అప్పగించారు. కాగా ప్రభుత్వం నుంచి రూ. 2.70 కోట్లు మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించారు. కానీ గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే పూర్తిచేశారు. నిధులు సరిపోకపోవడంతో మిగతా ఫ్లోర్ల పనులు అసంపూర్తిగా వదిలేయడం వల్ల ఉన్న ఒక్క ఫ్లోర్‌లోనే మొత్తం 217 మందికి బోధిస్తూ నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. సరిపడా గదులు లేకపోవడంతో పాటు చుట్టూ ప్రహరీ సైతం లేదు. తాగునీటికి సైతం ఇబ్బందులున్నాయి. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోవడానికి ఏఎన్‌ఎంను సైతం ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా సరిపడా ఫర్నీచర్ కూడా లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చుని చదువు సాగిస్తుండడం గమనార్హం.

ఎన్ని ఇబ్బందులున్నా.. చదువులో ముందే

కాగా ఇలాంటి ఇబ్బందులు ఎన్ని ఎదురవుతున్నా విద్యార్థులు వాటన్నింటినీ లెక్కచేయకుండా చక్కగా చదువులో రాణిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. దీంతో పాటు వందశాతం ఉత్తీర్ణత నమోదవుతోంది. ఈ నేపథ్యంలోనే.. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని... ఫలితంగా మరింతగా రాణించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాఠశాల పనిచేసే రోజుల్లో నిత్యం విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పరిష్కరించలేదు. అదేవిధంగా ఏఎన్‌ఎం నియామకం లేదు. ప్రహరి సైతం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం మరింత బాగా ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

– పావని ప్రిన్సిపాల్, కేజీబీవీ, రాజాపూర్

నాలుగేళ్లుగా ఇబ్బందుల మధ్యే..



వనపర్తి నుంచి వచ్చి రాజాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీలో నాలుగేళ్లుగా ఇబ్బందుల మధ్యే చదువు కొనసాగించాను. ఇటీవల వచ్చిన పదోతరగతి ఫలతాల్లో 9.3 సాధించాను. ఇప్పటికైనా వసతులు సమకూర్చితే మాలాంటి పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఫలితంగా చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

–ఐశ్వర్య, విద్యార్థిని

మరిన్ని నిధులు అవసరం



గ్రామపంచాయతీ నుంచి కేజీబీవీ కావాల్సిన స్థలం సమకూర్చాం. భవన నిర్మాణం పూర్తికావాలంటే అదనంగా మరో రూ. కోటి అవసరం అవుతుంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది.

– కొప్పెరిబచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్, రాజాపూర్

ఏ ఆపద వచ్చినా ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకొంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం శేక్‌పల్లి, ఎల్లంబాయితాండ, అత్యకుంటతాండల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేశారు. చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నిలిచి హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు శేక్‌పల్లిలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. హామీలను ఎన్నికల కోడ్ ముగియగానే అమలు చేస్తామన్నారు. జిల్లా నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, ఎస్పీ వెంకటేష్, మహేందర్, వెంకటయ్య, శ్రీను, నర్సింలు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీని అందరిని సమానంగా చూస్తుందని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు వస్తాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక కొత్తగంజి మార్కెట్ యార్డు ఆవరణలో పోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్.కృష్ణయ్య గుప్త, హమాలి సంఘం, లారీ అసోసియేషన్, దడవాయి సంఘం, చాట వర్కర్స్ సంఘం నుంచి భారీ ఎత్తున బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటే అందరిది, పేదలను కడుపులో పెట్టుకొని ఏకైక పార్టీ అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, రాశెద్‌ఖాన్, నర్సింలు, సంజీవ్‌గౌడ్, బాలకిష్టయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



నవాబుపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నవాబుపేట: ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించుకోవాలని అడిషనల్ ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం నవాబుపేట ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు చాకలపల్లి, మరికల్ గ్రామాల్లో పోలీసు ప్రత్యేక బెటాలియన్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేసి పోలింగ్ ప్రశాంతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో 8 గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఓటువేద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: స్వేచ్ఛా, ప్రజాస్వామ్యం, సమానత్వం, మతసామరస్యం కోసం కృషిచేయటంతోపాటు వాటి పరిరక్షణ లక్ష్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయాలని.. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్‌కమిటి కో కన్వీనర్ రవీందర్ పిలుపునిచ్చారు. కమిటీ నేతృత్వంలో 11రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు పర్యటించి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తున్నామన్నారు.ఈ నేపథ్యంలో పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీకి మూడోసారి అధికారం కట్టబెడితే విధ్వంసం జరుగుతుందన్నారు. ఇటీవలే యూనివర్సిటీల్లో దాడులు ప్రారంభం అయ్యాయన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. అధ్యయన వేదిక జిల్లా నాయకులు ఉదయమిత్ర, రాష్ట్ర చైతన్య మహిళాసంఘం కో కన్వీనర్ చైతన్య, హైదరాబాద్ కన్వీనర్ సత్య, టీపీజేఏసీ హైదరాబాద్ కన్వీనర్ మత్తయ్య, కమిటీ సభ్యులు మత్తయ్య, రామన్న ప్రకాష్, టీపీఫ్‌టీయూ నాయకులు ఖలీల్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల కోసం వచ్చిన కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే సుమారు 400 మంది పారిశుద్ధ్య కార్మికుల కోసం శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. మున్సిపాలిటీ ఆవరణలో కొత్తగా నిర్మించిన కళాభారతి సెల్లార్‌లో వీరికి ఇద్దరు వైద్యులు, నలుగురు నర్సులు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను అందజేశారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, రాంకీ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రావణిరెడ్డి, ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ మదన్‌కుమార్, స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) కన్సల్టెంట్ సుమీత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటాం



స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో ఓటమి తప్పదని.. బీసీలను నమ్మించి మోసం చేసి విభజించి పాలించాలని చూస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణను ఓడిస్తామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. మహబూబ్‌నగర్ బరిలో దాదాపు 10 నుంచి 15 మంది బీసీ బిడ్డలు పోటీలో ఉండడం గర్వకారణమన్నారు. లోక్‌సభ పరిధిలో ఉన్న బీసీ అభ్యర్థుల్లో అధిక జనాభా ఉన్న అభ్యర్థిని గుర్తించి వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపునకు కృషి చేస్తామన్నారు. మూడు ప్రధాన పార్టీలు ఈ సారి బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత కూడగట్టుకున్నట్లు తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో అత్యధిక సామాజిక వర్గమైన వాల్మీకులకు బీజేపీ సీటు కేటాయించి అక్కడ మాజీ ఎమ్మెల్యే హోదాలో డీకే అరుణ తమ పార్టీకి చెందిన బీజేపీ అభ్యర్థి ఓటమికి సహకరించినట్లు ప్రత్యక్ష ఉదాహరణలు ఉన్నాయన్నారు. గద్వాలలో బీసీల మధ్య కొట్లాటపెట్టి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో కీలకంగా వ్యవహరించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆమె గుణపాఠం చెప్పేందుకు బీసీ సమాజం ఎదురు చూస్తుందన్నారు.

పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల: తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి అభివృద్ధి దిశలో నడిపించిన బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి మాజీ సీఎం కేసీఆర్ బలపర్చిన ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓట్లేసి మరోసారి గెలిపించాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలంలోని రాచాల, పొన్నకల్, కందూర్, శాఖాపూర్, గుడిబండ, అడ్డాకుల గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి కారు గుర్తును గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీని గెలిపించాలి



అడ్డాకుల: మహబూబ్‌నగర్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అడ్డాకుల మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రభారి ప్రతాప్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించాలంటే మరోసారి బీజేపీ ప్రభుత్వం రావాలని చెప్పారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. డీకే అరుణ ఎంపీగా గెలిపిస్తే పాలమూరు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బుచ్చన్నయాదవ్, చెన్నగౌడ్, సురేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, అరవింద్‌రెడ్డి, ధర్మన్నయాదవ్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హన్వాద: మండల పరిధిలోని టంకర, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరారు. జిల్లా నాయకులు కిశోర్, మండల నాయకుడు రఘురాంగౌ డ్, శ్రీధర్, శేషు, శ్రీనివాస్‌రెడ్డి, భరత్, రంగన్న, రాజు, గంగపురి, చంద్రయ్య, కృష్ణయ్య, శంక ర్, హన్మంతు, రవి, శివ, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా నాయకులు ఏపీ రాములు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నంచర్ల, వెంకటరెడ్డి పల్లి గ్రామాల్లో పర్యటించారు. మళ్లీ మోదీ అధికారంలోకి రావాలంటే బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎన్నికల మండల ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

భూత్పూర్: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని.. ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్త మొల్గరలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, చిల్లా రఘురెడ్డి, వెంకటేష్, మాసగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కేంద్రంలో బీజేపీని గద్దెదించి కాంగ్రెస్‌ను గెలిపించాలని మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తొలగిస్తారని, రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ఆ పార్టీ పెద్దలే చెబుతున్నారని అన్నారు. వర్కింగ్ చైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాడం బాలరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య, జిల్లా అధ్యక్షులు కావలి రమేష్, శంకర్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని సీనియర్ నాయకులు నరహరి పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, ఇస్తారయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

హన్వాడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపి అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, సీనియర్ నాయకుడు గో పాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మండల పరిధిలో కూటమి అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి తరుపున ప్రచారం చేశారు. నాయకులు లక్ష్మయ్య, రాములు, బాలయ్య, రేకమయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని రైతుబంధు సమితి మాజీ జిల్లా డైరెక్టర్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీ గ్రామ అధ్యక్షుడిగా వరద తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా వై.నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీకి రాజీనామా చేయాలి

భూత్పూర్: ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి పార్టీకి రాజీనామా చేయాలని మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్ అన్నారు. శుక్రవారం భూత్పూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత లాభం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరిన కదిరె శేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడితే నష్టం లేదని అన్నారు. మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, సత్యనారాయణ, మండలంలోని వివిధ గ్రామాలల్లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. నాయకులు మహ్మద్ సాధిక్, గడ్డంయాదయ్య, గడ్డం ప్రేమ్‌కుమార్, తిరుపతయ్య గౌడ్, రాకేష్ గౌడ్, కృష్ణయ్య గౌడ్, రామస్వామి తదితరులు ఉన్నారు.

నవాబుపేట: మన ఊరు.. మన మన్నె... మళ్లీ గెలవాలంటూ మండలంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఊరూర ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రచార కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఉచిత శిక్షణ అభినందనీయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత కరాటే శిక్షణా శిబిరం నిర్వహిస్తుండడం అభినందనీయమని డీఎస్‌పీ పి.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్టలోగల అల్‌నూర్ స్కూల్‌లో కింగ్‌షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 26వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సెల్ఫ్ డిఫెన్స్ కోసం బాలికలు, మహిళలు కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని కోరారు. ఉచిత కరాటే శిక్షణ శిబిరంలో యోగా, కిక్‌బాక్సింగ్, బాక్సింగ్ నేరిప్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కరాటే శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, బాలు మహేందర్ నాయక్, అల్‌నూర్ స్కూల్ డైరెక్టర్ ఖాజాపాష, కరస్పాండెంట్ అహద్ సిద్దిఖీ, ప్రిన్సిపాల్ నాజియ సుల్తానా పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలు చేసిందేమీలేదు



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ బీజేపీలు చేసిందేమీ లేదని తెలంగాణను దోచుకుని అప్పులపాలు చేశారని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆముదాలగడ్డ, చీకర్లబండతాండ, గాధిర్యాల్, గువ్వోనికుంట,చౌదర్‌పల్లి, పెద్దతాండా, మంగంపేట్, మొకర్లాబాద్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టినా ఓట్లు అడగడానికి మళ్లీ ఎలా వస్తారని ఎద్దేవా చేశారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, కమతం శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, రాధారెడ్డి, ముంకుదం తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో పేలిన ట్రాన్స్‌ఫార్మర్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 41వ వార్డు పరిధిలోని షాషాబ్‌గుట్ట ప్రాంతంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. అంతకుముందు గురువారం మధ్యరాత్రి మూడు గంటల తర్వాత రెండుసార్లు ట్రిప్ అయింది. ఈ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయనతో పాటు కౌన్సిలర్ భర్త మహ్మద్ రిజాజుద్దీన్ అంజద్ ఘటన స్థలాన్ని పరిశీలించి ట్రాన్స్‌కో ఏఈ భగవంత్ మాట్లాడి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. చివరకు ఉదయం 10.30 గంటలకల్లా అక్కడ మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

‘వైఎస్సార్’ భూ పంపిణీతోనే లబ్ధి పొందారు

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే ఆనాటి నుంచి నేటివరకు ప్రభుత్వ భూములను పంచారని.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన భూ పంపిణీ వంటి పథకాలతో మాదిగ జాతులు అభివృద్ధి చెందాయని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పే బీజేపీ నేతలు ఎస్సీ వర్గీకరణ సమస్యను ఎలా తీర్చుతారని ప్రశ్నించారు. వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నర్సిములు, నాయకులు పాల్గొన్నారు.



గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతికార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలం పర్దిపూరం, లాల్‌కోట, బండ్రపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు దమగ్నాపూరం గ్రామంలో ఆయన సమక్షంలో పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి. సురేందర్‌రెడ్డి, కృష్ణయ్యలతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.